# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ గ్రంథాలయాలు సామాజిక పరివర్తనకు సాధనాలు అని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

❖ ప్రజలకు సేవ చేయడమే బీజేపీ సిద్ధాంతంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

❖ దేశంలో రానున్న అయిదేళ్ళలో 50 విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.

❖ ఆరావళి పర్వత శ్రేణిలో ఉన్న కుంభాల్‌గఢ్ వన్యప్రాణుల అభయారణ్యాన్ని సున్నితమైన మండలంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

=======================

గ్రంథాలయాలు సామాజిక పరివర్తనకు సాధనాలని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో మహాదేవ్ దేశాయ్ లైబ్రరీ ఎక్స్‌టెన్షన్‌ను ఉపరాష్ట్రపతి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా "ఏజ్ ఆఫ్ ఎలైట్‌మెంట్ మహాత్మా గాంధీ విజన్" అనే పుస్తకాన్ని విడుదల చేశారు. అదే విధంగా 1930 నుండి 1940 మధ్యలో ఢిల్లీ సందర్శన సమయంలో మహాత్మా గాంధీ కస్తూరిబా గాంధీ బస చేసిన ఆశ్రమాన్ని, కస్తూరిబా మ్యూజియాన్ని కూడా రాధాకృష్ణన్ సందర్శించారు. అనంతరం సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో జ్ఞానం వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు.

=======================

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నికయ్యారు. పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ కె. లక్ష్మణ్ న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఈరోజు జరిగిన "సంఘటన్ పర్వ్" కార్యక్రమంలో నితిన్ నబీన్ ఎన్నికను అధికారికంగా ప్రకటించి ధృవీకరణ పత్రాన్ని ఆయనకు అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జగత్

ప్రకాష్ నడ్డా, నితిన్ గడ్కరీ.. కొత్త అధ్యక్షుడిని అభినందించారు. బీజేపీ వారసత్వాన్ని నితిన్ నబీన్ ముందుకు తీసుకువెళ్తారని ఈ సందర్భంగా నరేంద్ర మోదీ అన్నారు. సంస్థాగత కార్యకలాపాలలో ఆయనకు ఉన్న విస్తృతమైన అనుభవం పార్టీలోని ప్రతి కార్యకర్తకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో రానున్న అయిదేళ్ళలో 50 విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదికలో భాగంగా భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ సెషన్‌కు హాజరైన కేంద్రమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడిచిన దశాబ్ద కాలంలో భారత్ లో 50 రోజులకు ఒక నూతన విమానాశ్రయాన్ని నిర్మించామన్నారు. రానున్న కాలంలో భారత్ లో మరిన్ని విమానాశ్రయాలు వస్తాయని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆరావళి పర్వత శ్రేణిలో ఉన్న కుంభాల్‌గఢ్ వన్యప్రాణుల అభయారణ్యాన్ని పర్యావరణ పరంగా సున్నితమైన మండలంగా ప్రకటిస్తూ.. కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయం ఆ ప్రాంత వృక్షజాలం, జంతుజాలాన్ని సంరక్షించడంలో సహాయపడటమే కాకుండా అభయారణ్యంలో చుట్టు పక్కల నివసించే స్థానిక సమాజాలకు కూడా మద్దతు ఇస్తుందని ఆ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. కుంభాల్‌గఢ్ వన్యప్రాణుల అభయారణ్యం చుట్టూ ఒక కిలోమీటరు వరకు ఉన్న ప్రాంతమంతా చిరుతపులి, చారల హైనా, అడవి పిల్లి, భారతీయ పాంగోలిన్, బ్లూ బుల్, చింకారా వంటి విస్తృత శ్రేణి వన్యప్రాణులకు నిలయంగా ఉందని అన్నారు. ఈ కీలకమైన ప్రాంతంలో సేంద్రీయ వ్యవసాయంతో పాటు అటవీ, పర్యావరణ అనుకూలమైన కేంద్రీకృత కార్యక్రమాలను ప్రోత్సహించనున్నట్లుగా కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆరోగ్య రంగంలో రాబోయే 25 ఏళ్లలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ పేర్కొన్నారు. పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (jipmer) 14వ స్నాతకోత్సవంలో ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ లక్ష్యాన్ని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతర ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణపై పూర్తి స్థాయిలో దృష్టి సారించడమే జాతీయ ఆరోగ్య విధానం లక్ష్యమని అనుప్రియ పటేల్ అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ ను సకాలంలో అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న ప్రగతి 50వ సమావేశాన్ని ఇటీవల పూర్తి చేసుకుంది. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగతి పేరుతో నిర్మాణాత్మకయిన సమీక్షా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రగతి ద్వారా ప్రధానమంత్రి ప్రత్యక్షంగా సమీక్షలను చేపట్టడంతో కీలకమైన మౌలిక సమస్యలకు పరిష్కారం లభించింది. అందులో భాగంగా మహారాష్ట్రలోని బెంబ్లా నీటిపారుదల ప్రాజెక్టు పురోగతి గురించి ఈరోజు తెలుసుకుందాం.

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద అమలు చేయబడిన బెంబ్లా ప్రాజెక్ట్ మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టు. 2 వేల 685 కోట్ల రూపాయలకు పైగా ఆమోదిత వ్యయంతో 2007 ఏప్రిల్ 2న మంజూరు చేయబడిన ఈ ప్రాజెక్ట్ యావత్మల్ జిల్లాలో బెంబ్లా నదిపై ఉంది. ఈ ప్రాజెక్టు నిరంతర అనేక సవాళ్లను ఎదుర్కొనేది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రగతి యంత్రాంగం దీనిని సమీక్షకు స్వీకరించారు. ఈ ప్రాజెక్ట్‌ను 2023 అక్టోబర్ 25న ప్రధానమంత్రి సమీక్షించారు. అనంతరం దీనిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను సమన్వయంతో సమయానుకూలంగా పరిష్కరించడానికి సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు, మహారాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణను వేగవంతం చేయడం, మెరుగైన ప్రణాళిక వనరుల సమీకరణ ద్వారా బ్యాలెన్స్ కెనాల్ లైనింగ్ పనులను పూర్తి చేయడం వంటివి ఈ సమీక్ష అనంతరం జరిగాయి. ప్రగతి సమీక్ష తర్వాత ఈ ప్రాజెక్ట్ అమలు వేగం గణనీయంగా పెరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర మత్స్య శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో 83 భాగస్వామ్య దేశాల రాయబారులు, హైకమిషనర్లతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని రేపు నిర్వహించనున్నారు. ఆసియా, ఆఫ్రికా, యూరప్, ఉత్తర అమెరికా, ఓషియానియా, లాటిన్ అమెరికా, కరేబియన్‌లోని భాగస్వామ్య దేశాల రాయబారులు, హైకమిషనర్ల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మత్స్య, పశుసంవర్ధక పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమావేశానికి ఆ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అధ్యక్షత వహిస్తారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, సముద్ర ఆహార ఎగుమతి ప్రోత్సాహకాలు, అంతర్జాతీయ మార్కెట్ సంబంధాలను బలోపేతం చేయడం వంటి వాటిపై ఈ సదస్సు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళలోని శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో రెండు నెలలకు పైగా కొనసాగిన మండల– మకరవిలక్కు తీర్థయాత్ర ఈ రోజుతో ముగిసింది. ఉదయం 6 గంటల 45 నిమిషాలకు ఆలయ ద్వారాలను అధికారికంగా మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధికారులు ప్రకటించారు. అంతకముందు ఉదయం 5 గంటలకు ఆలయంలో నిత్యపూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం తూర్పు మండపంలో గణపతి హోమం నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 246 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 1,065 పాయింట్ల నష్టంతో 82 వేల 180 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 353 పాయింట్లు నష్టపోయి 25 వేల 323 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 90 రూపాయల 97 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =